క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు నియోజకవర్గం పరిధిలో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ప్రొద్దుటూరు విద్యుత్ డివిజన్ ఈఈ శ్రీనివాసులురెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రొద్దుటూరు, రాజుపాళెం మండలాల్లోని అన్ని సబ్ స్టేషన్లలో మెయింటెనెన్స్ కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాజుపాళెం : ఆడదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆటలపై ఆసక్తి కలిగిన వారు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని మండల ప్రత్యేకాధికారి రాఘవేంద్ర కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన రాజుపాళెంలోని తహసీల్దార్ కార్యాలయంలో మాట్లాడుతూ 15 సంవత్సరాలు పైబడినవారు ఆధార్ కార్డు, మొబైల్ నెంబర్ ఆయా సచివాలయాల్లో అందజేస్తే వారి పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామన్నారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, క్రికెట్, బాడ్మింటన్ ఈ ఐదు ఆటలకు సంబంధించి ఆసక్తి కలిగిన వారంతా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఒక్కొక్కరు రెండు ఆటల్లో పాల్గొనేందుకు అవకాశం ఉంటుందని, గ్రామ పంచాయితీ పరిధిలో ఉన్న వారంతా ఆ సచివాలయంలోనే పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు


క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ప్రధానోపాధ్యాయుడు

బద్వేలు అర్బన్ : క్రీడల్లో రాణించే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.వెంకటసుబ్బారెడ్డి పేర్కొన్నారు. బద్వేలు మండల ఎస్జీఎఫ్ క్రీడల ఎంపికలు శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని, ఇందుకోసం విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లో రాణించాలని కోరారు. క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు నాగేశ్వర్ రావు, బాలయ్య, మాబాష, కొండయ్య, మేరీప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ లబ్ధికే సనాతన ధర్మంపై విమర్శలు

ప్రొద్దుటూరు కల్చరల్ : రాజకీయ లబ్ధి పొందడానికే తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్ సనాతన ధర్మంపై విమర్శలు చేశారని జాతీయ వాద రచయితల సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ పెరుగు భవాని శంకర్ యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సృష్టి ప్రారంభమైనప్పటి నుంచి సనాతన ధర్మం ఉందని, ప్రపంచానికి జ్ఞాన భిక్ష ప్రసాదించిన ధర్మం సనాతన ధర్మం అన్నారు. ఉదయనిధి స్టాలిన్ సనాతన ధర్మాన్ని కరోనా వైరస్‌తో పోల్చడం దారుణమని పేర్కొన్నారు. ఉదయ నిధి స్టాలిన్ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వై.రమేష్ పాల్గొన్నారు.

శాంతియుత వాతావరణంలో గణేష్ ఉత్సవాలు

కడప సెవెన్‌రోడ్స్ : శాంతియుత వాతావరణంలో వినాయక ఉత్సవాలను నిర్వహించేందుకు శాంతి కమిటీ సభ్యులు కృషి చేయాలని కలెక్టర్ విజయరామరాజు అన్నారు. గణేష్ ఉత్సవాల నిర్వహణపై శుక్రవారం కలెక్టరేట్‌లో శాంతి కమిటీ సమావేశం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ఉత్సవాలు సజావుగా జరిగేలా ఏర్పాట్లను చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలందరూ మట్టి విగ్రహాలను ఉపయోగించాలని ఆయన పిలుపునిచ్చారు. మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు కమిటీలు ముందుకు వస్తే నామినల్ రుసుముతో అనుమతులు ఇస్తామని చెప్పారు. సింగల్ విండో పద్ధతిలో విగ్రహాల ఏర్పాటుకు అనుమతుల మంజూరుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మత సామరస్యానికి ప్రతీకగా అన్ని మతాల ప్రజల సహకారంతో గణేష్ ఉత్సవాలలో ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా ఉత్సవాలు జరిగేలా చూడాలన్నారు.

రేషన్ దుకాణం తనిఖీ

బ్రహ్మంగారిమఠం: మండలంలోని మల్లేపల్లె ఎస్సీ కాలనీలో రేషన్ దుకాణాన్ని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ చిత్తా విజయ్‌ప్రతాపరెడ్డి తనిఖీ చేశారు. 49 అర కిలో చక్కెర ప్యాకెట్లు, బియ్యం తూకం వేయగా కిలోన్నర తక్కువ కనిపించడంతో నాగిపోగు పావనిపై కేసు నమోదు చేయాలని బద్వేలు విజిలెన్స్ డీటీ చంద్రశేఖర్‌కు సూచించారు. చిత్తా విజయ్ ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ మల్లేపల్లె రేషన్ షాపు పరిధిలోని గ్రామాల నుంచి అధికంగా ఫిర్యాదులు వచ్చాయన్నారు.

ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం

చాపాడు : చిన్నగురువళూరులో శనివారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మండల వైద్యాధికారి డాక్టర్ కావ్య మాధురి తెలిపారు. ఉదయం 9.30గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకూ నిర్వహించే ఈ శిబిరంలో అన్ని రకాలైన వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేస్తామన్నారు.

సంక్షేమ పథకాలతో అభివృద్ధి

గడప గడపకు మన ప్రభుత్వంలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ


సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

కాశినాయన : పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని బాలాయపల్లె గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అలాగే సంక్షేమ పథకాల వలన కలిగిన లబ్ధిని వివరిస్తూ బుక్‌లెట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. అన్ని వర్గాలను ఆదుకునేందుకు సీఎం అహర్నిశలు కృషి చేస్తున్నారని తెలిపారు. 2024లో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసేందుకు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మైథిలి, ఈఓపీఆర్డీ ముజఫర్ రహీమ్, సచివాలయాల మండల కన్వీనర్ హనుమంత్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రమణారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, వీరారెడ్డి, గొంటువారిపల్లె సర్పంచ్ పిచ్చిరెడ్డి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఇంటి వద్దనే వైద్య సేవలు

పోరుమామిళ్ల : ప్రజలందరూ సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలనే ఆశయంతో ముఖ్యమంత్రి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిబద్ధతో అమలు చేస్తున్నారని ఎంపీడీఓ చంద్రమౌళి, స్పెషల్ ఆఫీసర్ చంద్రశేఖర్, తహసీల్దారు గంగయ్య పేర్కొన్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో జేఏఎస్ కార్యక్రమంపై జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. జేఏఎస్‌పై ముందుగా ప్రజలందరికీ అవగాహన కల్పించేందుకు ఇంటింటి ప్రచారం జరగాలన్నారు. వలంటీర్లు ప్రతి ఇంటికి వెళ్లి వైద్య చికిత్స అవసరమున్నవారిని గుర్తించాలని, అలాంటి వారి వివరాలు ఏఎన్‌ఎంలు, వైద్య సిబ్బంది నమోదు చేసి పీహెచ్‌సీ వైద్యులకు అందిస్తారన్నారు. విలేజ్ హెల్త్ క్లినిక్‌ల వారీగా ఆరోగ్య శిబిరాలు నిర్వహించి, రోగులను పరీక్షించి అవసరమైన చికిత్సలు, మందులు అందిస్తారన్నారు. క్రిటికల్ కేసులను ఉన్నత ఆసుపత్రులకు రెఫర్ చేస్తారన్నారు. వైద్యశిబిరాల ఏర్పాటు, నిర్వహణ ఎంపీడీఓ, తహసీల్దారు పర్యవేక్షణలో పీహెచ్‌సీ వైద్యుల సహకారంతో జరుగుతుందన్నారు. జేఏఎస్ కార్యక్రమంలో మండలంలో సంపూర్ణంగా విజయవంతమయ్యేందుకు కార్యదర్శులు కృషి చేయాలన్నారు. సమావేశంలో కార్యదర్శులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

బి.కోడూరు : జగనన్న ఆరోగ్య సురక్షపై ప్రజలకు అవగాహన కల్పించాలని బి.కోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ వినీత్‌కుమార్‌రాజు, డాక్టర్ ఉదయ్‌కిరణ్‌లు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జగనన్న ఆరోగ్య సురక్షపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వలంటీర్లు, ఏఎన్‌ఎంలు ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహించి ప్రజల ఆరోగ్య వివరాలను నమోదు చేయాలన్నారు. ఈ నెల 15వ తేదీ నుంచి అన్ని సచివాలయాల పరిధిలోని అన్ని గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్షపై ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. దీర్ఘకాలిక వ్యాధులు ఉన్న వారు, గర్భిణులు, చిన్నపిల్లలు, బరువు తక్కువ పిల్లలు, బాలింతలు, అనీమియా ఉన్న వారిని గుర్తించాలన్నారు. ఈ నెల 16వ తేదీ నుండి వైద్య సిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పీలు గ్రామాల్లో డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ఉన్న వారిని సర్వే ద్వారా గుర్తించాలన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ నాగమణి, ఆరోగ్య పర్యవేక్షకులు జాన్‌విలియం, విజయలక్ష్మి, ఎల్‌డీ కంప్యూటర్ రాజమ్మ, హెల్త్ అసిస్టెంట్ రామతీర్థం, వైద్య సిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయండి


పెన్నానదిపై జరుగుతున్న హైలెవెల్ బ్రిడ్జి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు సౌకర్యం కల్పించాలని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి కోరారు. ఎమ్మెల్యే శుక్రవారం పెన్నా నదిపై జరుగుతున్న హైలెవెల్ బ్రిడ్జి పనులతోపాటు రామేశ్వరంలోని బ్రాహ్మణ శ్మశాన వాటిక అభివృద్ధి పనులను, ప్రకాష్ నగర్‌లో సిమెంటు రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. వర్షాకాలంలో పనులు జాప్యం కాకుండా వేగంగా పూర్తి చేయాలని సూచించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, ఆర్‌పీసీఏ మెంబర్ కాకర్ల నాగేషారెడ్డి, కౌన్సిలర్ వరికూటి ఓబుళరెడ్డి, మంచాల మదన్ కుమార్ ఉన్నారు.

పెట్రోలు బంకు ఏర్పాటుపై ఆర్డీఓ ఒప్పందం


బీపీసీఎల్ మేనేజర్ గురుసాయిధనుష్‌కు లీజ్ డీడ్‌ను అందిస్తున్న ఆర్డీఓ శ్రీనివాసులు

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు మండల రెవెన్యూ కార్యాలయం వద్ద రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో నిర్మించనున్న (భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్) పెట్రోలు బంకుపై ఆర్డీఓ శ్రీనివాసులు, బీపీసీఎల్ మేనేజర్ గురుసాయి ధనుష్ శుక్రవారం ఒప్పందం చేసుకున్నారు. కలెక్టర్ విజయరామరాజు ఆదేశాల మేరకు జిల్లాకు సంబంధించి ప్రప్రథమంగా ప్రొద్దుటూరు మండల కార్యాలయం వద్ద 20 సెంట్ల స్థలంలో పెట్రోలు బంకు నిర్మాణానికి ఒప్పందం జరిగింది. ఆర్డీఓ 20 ఏళ్లపాటు ఈ స్థలాన్ని బీపీసీఎల్‌కు లీజుకు ఇచ్చారు. ఈనెల 1వ తేదీ నుంచి నెలకు రూ.లక్షా 32వేలు చొప్పున బీపీసీఎల్ అధికారులు రెవెన్యూ శాఖకు అద్దె చెల్లించనున్నారు. ఈ ప్రకారం ఐదేళ్లకోమారు 20 శాతం చొప్పున అద్దెను పెంచనున్నారు. 1-9-2023 నుంచి 31-8-2043 వరకు ఈ స్థలాన్ని లీజుకు ఇస్తున్నట్లు స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్టర్ చేయించారు. ఆర్డీఓతోపాటు డిప్యూటీ తహసీల్దార్ జె.మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

పంట నమోదు పక్కాగా చేపట్టండి

అట్లూరు : పంట నమోదు పక్కాగా చేపట్టాలని బద్వేలు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.నాగరాజ తెలిపారు. శుక్రవారం అట్లూరు రైతు భరోసా కేంద్రంలో మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీలోపు పంట నమోదు పూర్తి చేయాలని, 30వ తేదీలోపు సామాజిక తనిఖీకి సిద్ధం చేసుకోవాలన్నారు. అలాగే అన్ని రైతు భరోసా కేంద్రాల్లో అవసరమైన ఎరువులను అందుబాటులో ఉంచాలన్నారు. అలాగే పీఎం కిసాన్, చిరుధాన్యాల సాగు విస్తీర్ణం పెంపు, 90 శాతం సబ్సిడీపై డ్రిప్, స్ప్రింకర్లు పంపిణీ, రైతుసేవా కేంద్రాలు, కిసాన్ డ్రోన్లు వంటి అంశాలపై చర్చించారు. సమావేశంలో మండల వ్యవసాయాధికారి రామకృష్ణయ్య, రైతుభరోసా సహాయకులు అరుణ, రైతులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అష్టలక్ష్మివ్రతం


అష్టలక్ష్మీవ్రతం ఆచరిస్తున్న మహిళలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని ఘనంగా అష్టలక్ష్మి వ్రతాన్ని నిర్వహించారు. వేకువజామున అగస్త్యేశ్వరస్వామికి, రాజరాజేశ్వరిదేవికి విశేష అభిషేకాలు నిర్వహించారు. అష్టలక్ష్మి అమ్మవారి ఉత్సవ మూర్తిని రంగురంగుల నూతన పట్టువస్త్రాలతో, పూలతో, ఆభరణాలతో అలంకరించి ఆలయ ప్రాంగణంలోని కాలక్షేప మండప వేదికపై కొలువుదీర్చారు. వేదపండితులు అష్టలక్ష్మిపూజను నిర్వహించారు. పసుపు, కుంకుమ, దీపాలు, కలశం, నైవేద్యంతో అమ్మవారిని పూజించి కర్పూర హారతులు ఇచ్చారు. వేదపండితులు అష్టలక్ష్మిపూజ చేయడం వల్ల కలిగే శుభాలను వివరించి దశ హారతులను ఇచ్చారు. ప్రజల్లో ఆధ్యాత్మిక చింతనను పెంపొందించేందుకు, లోకకల్యాణార్థం 108 మంది సుహాసినులతో సామూహికంగా అష్టలక్ష్మిపూజను నిర్వహించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి తెలిపారు. పూజాకార్యక్రమం అనంతరం కొవ్వూరు రమేష్‌రెడ్డి, జయమ్మ దంపతుల ఆధ్వర్యంలో ప్రసాద వితరణ జరిగింది.

ఓబులాపురంలో పశువైద్య శిబిరం

మైదుకూరు : మండలంలోని ఓబులాపురంలో శుక్రవారం వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) సౌజన్యంతో ఏర్పాటుచేసిన పశు వైద్య శిబిరాన్ని సర్పంచి మూలె వెంకటలక్ష్మమ్మ ప్రారంభించారు. 22 దూడలకు నట్టల నివారణ మందుతాగించి, ఎనిమిది పశువులకు చూడి పరీక్షలు నిర్వహించారు. ఆరు పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్సలు, 28 పశువులకు సాధారణ చికిత్స చేశారు. ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ గురివిరెడ్డి, మండల పశువైద్యాధికారి ఆర్.సుధాకర్, ఆదర్శ రైతులు రామానందరెడ్డి, రాజగోపాల్ రెడ్డి, రామచంద్రారెడ్డి, టి.బాలనరసింహారెడ్డి పాల్గొన్నారు.

12న మినీ జాబ్ మేళా

జమ్మలమడుగు రూరల్: ఈ నెల 12న జమ్మలమడుగు మండలం అంబవరం గ్రామం లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మినీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ సురేంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. జాబ్‌మేళాకు పది, ఇంటర్, డిగ్రీ, ఇంజినీరింగ్ విద్యార్థులు హాజరు కావచ్చునన్నారు. వివరాలకు 90004 79991, 90636 23706 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

ఫిజియోథెరపీకి పెరుగుతున్న ఆదరణ


ఫిజియోథెరపీ డే సంబరాలు జరుపుకుంటున్న వైద్యులు

ప్రొద్దుటూరు క్రైం : రోజు రోజుకు ఫిజియోథెరపీకి ఆదరణ పెరుగుతోందని ప్రొద్దుటూరు ఫిజియోథెరపీ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ సర్వేష్ తెలిపారు. స్థానిక హోమస్‌పేటలో శుక్రవారం ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. ప్రొద్దుటూరుతో పాటు మైదుకూరు, జమ్మలమడుగు ప్రాంతాలకు చెందిన ఫిజియోథెరపీ వైద్యులు పాల్గొన్నారు. అనంతరం 2023-25 సంవత్సరానికి గాను నూతన అసోసియేషన్‌ను ఎన్నుకున్నారు. ప్రెసిడెంట్‌గా డాక్టర్ సర్వేష్, సెక్రటరిగా డాక్టర్ రమేష్, ట్రెజరర్‌గా డాక్టర్ వినయ్, వైస్ ప్రెసిడెంట్‌లుగా ఓబులేసు, ఆజాద్, జాయింట్ సెక్రటరిగా తబస్సుమ్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ మస్తాన్, పట్టణంలోని ఫిజియోథెరపి వైద్యులు పాల్గొన్నారు.

విద్యార్థిని అదృశ్యం

వేంపల్లె: స్థానిక పిరమిడ్‌నగర్‌లోని అటవీశాఖలో పనిచేస్తున్న జానపాటి వెంకటేశ్వర్లు కుమార్తె ఈశ్వరి బుధవారం నుంచి కనిపించడం లేదని వేంపల్లె ఎస్సై తిరుపాల్‌నాయక్ తెలిపారు. ఈశ్వరి ఇంటర్ వరకు చదువుకుందని, మతిస్థిమితం లేక ఇంటి నుంచి వెళ్లిన ఆమె తిరిగి రాలేదన్నారు. కుటుంబీకులు వెతికినా ఆచూకీ తెలియలేదన్నారు. తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేశామన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా


ఉట్టికొట్టే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కుడా చైర్మన్ గురుమోహన్

బద్వేలు అర్బన్ : కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా స్థానిక నెల్లూరురోడ్డులోని శ్రీకృష్ణ మందిరం ఆవరణలో శుక్రవారం నిర్వహించిన ఉట్టి కొట్టే కార్యక్రమం ఉల్లాసంగా సాగింది. యువకులు పెద్ద ఎత్తున పాల్గొని ఉట్టి కొట్టేందుకు ఉత్సాహం చూపారు. తొలుత కార్యక్రమాన్ని కుడా చైర్మన్ సింగసాని గురుమోహన్, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు గోపాలస్వామి, ఆర్.వి.సాయిక్రిష్ణ, శ్రీకృష్ణ మందిరం ఆలయ కమిటీ అధ్యక్షుడు చిట్టిబోయిన చెన్నయ్యయాదవ్‌లు ప్రారంభించారు. సాయంత్రం స్వామి వారి గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవం వెంట ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ సన్నిబోయిన సుబ్బరాయుడు, ఆర్థిక కార్యదర్శి రామనబోయిన శ్రీనివాసులు, ఆర్గనైజింగ్ సెక్రటరీ గోగులప్రసాద్, ఉపాధ్యక్షులు ఉంటా నరసింహులు, సుబ్బయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో కనీస అవసరాలను తీరుస్తాం

వేముల: యురేనియం ప్రాజెక్టు పరిధిలోని పాఠశాలల్లో కనీస అవసరాలను తీరుస్తామని సీఎస్‌ఆర్ కమిటీ చైర్మెన్ అండ్ ఇండిపెండెంట్ డైరెక్టర్ యూసీఐఎల్ పి.కె.పాండా పేర్కొన్నారు. వేములలోని కస్తూర్బా పాఠశాల, కళాశాల, వెలమవారిపల్లె సమీపంలోని బి.ఆర్.అంబేడర్ గురుకుల పాఠశాలలను యురేనియం ప్రాజెక్టు జీఎం ఎం.ఎస్.రావుతో కలిసి శుక్రవారం ఆయన సందర్శించారు. తరగతి గదులు, హాస్టళ్లను పరిశీలించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పి.కె.పాండా మాట్లాడుతూ విద్యార్థులు మెరుగైన భారతదేశం కోసం మంచి స్థానాల్లో ఉండేందుకు ఇప్పటి నుంచే సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రారంభమైన విగ్రహాల ప్రతిష్టాపనోత్సవాలు


పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న వేద పండితులు

పోరుమామిళ్ల : రంగసముద్రం పంచాయతీ రెడ్డినగర్‌లో నిర్మించిన నూతన దేవస్థానంలో నూతన విగ్రహాల ప్రతిష్టా కార్యక్రమాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. శ్రీ వరసిద్ధి వినాయక, సీతా లక్ష్మణ హనుమత్ సమేత కోదండరామస్వామి, శిఖర కలశ, ధ్వజస్తంభ, నాగుల ప్రతిష్ట కార్యక్రమాలకు ముందుగా విశ్వక్సేన ఆరాధన, గణపతిపూజ నిర్వహించారు. నూతన ఆలయ నిర్మాణం గురించి తెలుసుకొన్న శివరామానంద సరస్వతి (మాజీ ఎమ్మెల్యే) శుక్రవారం ఆలయాన్ని సందర్శించారు. రంగసముద్రం సర్పంచ్ చిత్తా రవిప్రకాష్‌రెడ్డి ద్వారా దేవస్థానం గురించి వివరాలు తెలుసుకొన్నారు. శుక్రవారం వేదపండితులు, రుత్విక్కులు ప్రారంభ పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

శ్రద్ధతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

సాక్షి మీడియా గ్రూపు డైరెక్టర్ వై ఈశ్వరప్రసాద్‌రెడ్డి

ఎర్రగుంట్ల: ప్రతి విద్యార్థి ఉపాధ్యాయులు బోధించిన పాఠాలను శ్రద్ధతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పాఠశాల పూర్వ విద్యార్థి సాక్షి మీడియా గ్రూపు డైరెక్టర్ వై.ఈశ్వరప్రసాద్‌రెడ్డి అన్నారు. పదో తరగతిలో ప్రథమ మార్కులు సాధించిన యర్రగుంట్ల జెడ్పీ బాలుర పాఠశాల విద్యార్థి యశ్వంత్‌కు రూ.10116లను నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో చదివి ఎందరో ఉన్నత పదవులు పొందారన్నారు.

సీఎం సీఎస్ జవహర్‌రెడ్డి, మాజీ మంత్రి ఎంవీ. మైసూరారెడ్డి, ఐపీఎస్ నాగన్న పాఠశాలలో చదివి ఉన్నత స్థాయికి చేరారన్నారు. అనంతరం ఈశ్వర ప్రసాద్‌రెడ్డితో కలిసి చదువుకున్న పూర్వ విద్యార్థులు నాటి గ్రూప్ ఫొటో అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రామాంజనేయరెడ్డి, ఉపాధ్యాయులు చంద్రఓబుళరెడ్డి, ప్రభుకుమార్, వై.వీరభద్రారెడ్డి, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

అందరి చదువు అందరి బాధ్యత

బి.కోడూరు : అందరి చదువు అందరి బాధ్యత అని మండల విద్యాశాఖాధికారి మూరతోటి సునీల్‌కుమార్ తెలిపారు. శుక్రవారం మండలంలోని రామచంద్రాపురం ఎంపీపీ పాఠశాలలో అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ చదువుకున్న వ్యక్తి దేశానికి శక్తి అని, ప్రతి ఒక్కరు చదువుకున్నప్పుడే దేశం అభివృద్ధి పథంలో పయనిస్తుందన్నారు. ముఖ్యంగా విద్యార్థులే కాకుండా వయోజనులు కూడా అక్షరాస్యత సాధించేందుకు తగు కార్యక్రమాలు రూపకల్పన చేశారన్నారు. వాటిని ఉపయోగించుకుని తమ ఉత్పాదక శక్తిని పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు కె.బాలసుబ్బయ్య, జీ.పెంచలయ్య, ఉపాధ్యాయులు, విద్యాకమిటీ సభ్యులు, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో అక్షరాస్యత ప్రధానం


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రామిరెడ్డి

పోరుమామిళ్ల : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ నాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామిరెడ్డి మాట్లాడుతూ ఏ దేశమైనా అభివృద్ధి చెందాలంటే అక్షరాస్యత ప్రధానమన్నారు. మన దేశంలో కేరళ అక్షరాస్యతలో ముందుండగా, బీహార్ వెనుకబడి వుందన్నారు. 2009లో కేంద్ర ప్రభుత్వం 14 సంవత్సరాలలోపు వారందరికీ నిర్బంధ ప్రాథమిక విద్యను అందించాలని చట్టం చేసిందన్నారు. 100 శాతం అక్షరాస్యతకు విద్యార్థుల సహకారం, కృషి అవసరమన్నారు. సమావేశంలో అధ్యాపకులు చంద్రశేఖర్‌రెడ్డి, బాలరాజు, అల్లాబకాష్, సురేష్, సువర్ణమ్మ, శ్రీలత తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

ఆలోచనా విధానంలో మార్పురావాలి


ర్యాలీ నిర్వహిస్తున్న జిల్లా మానసిక వైద్యాధికారి కవిత ప్రసన్న, సిబ్బంది

ప్రొద్దుటూరు క్రైం : ప్రజల ఆలోచనా విధానంలో మార్పు రావాల్సిన అవసరం ఉందని డీసీహెచ్‌ఎస్ డాక్టర్ హిమదేవి అన్నారు. ఈ నెల 10న ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినం సందర్భంగా ప్రజల్లో అవగాహన కల్పించే ఉద్దేశంతో జిల్లా మానసిక ఆరోగ్య విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా ఆస్పత్రి నుంచి గవిని సర్కిల్, వన్‌టౌన్ సర్కిల్ వరకు ర్యాలీ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీసీహెచ్‌ఎస్ హిమదేవి మాట్లాడుతూ క్షణిక ఆవేశంలో తీసుకున్న నిర్ణయం మూలంగా ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. ఒక్క క్షణం ఆలోచిస్తే బలవన్మరణాలు జరగవని తెలిపారు. జిల్లా మానసిక వైద్యాధికారి కవిత ప్రసన్న మాట్లాడుతూ ఆత్మహత్యలను నివారించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఈ సందర్భంగా ఫార్మసీ విద్యార్థులకు వ్యాస రచన పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆనంద్‌బాబు, జిల్లా మానసిక ఆరోగ్య కార్యక్రమ సభ్యులు రాధిక, శిల్ప, భాస్కర్, సుమన్‌బాబు, పవన్, శ్రీ లక్ష్మి వెంకటేశ్వర ఫార్మా కాలేజి విద్యార్థులు పాల్గొన్నారు.

నేత్రదానంతో అంధుల జీవితాల్లో వెలుగులు


మాట్లాడుతున్న జిల్లా అంధత్వ నివారణాధికారి డాక్టర్ సునీత

ప్రొద్దుటూరు క్రైం : ఒక వ్యక్తి నేత్రదానం చేయడం వల్ల ఇద్దరు అంధుల జీవితాల్లో వెలుగులు నింపవచ్చని జిల్లా అంధత్వ నివారణాధికారి డాక్టర్ సునీత తెలిపారు. స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్‌లో నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ వయసుతో సంబంధం లేకుండా స్వచ్ఛమైన కళ్లను ఎవరైనా దానం చేయవచ్చన్నారు. దీనిపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ఒక ఉద్యమంలా ముందుకు వెళ్లాలన్నారు. కంటి వైద్యాధికారి కేజే రఘురామిరెడ్డి మాట్లాడుతూ దేశంలో సుమారు 13 లక్షల మంది అంధత్వంతో బాధపడుతున్నారన్నారు. ప్రతి పౌరుడూ బాధ్యతగా తీసుకొని వారి మరణానతరం నేత్రదానం చేయాలని కోరారు. అనంతరం శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కాలేజీలో నేత్రదానంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. నేత్రదాన ఆవశ్యకతపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో మంచి ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులను అందచేశారు. కార్యక్రమంలో జిల్లా కంటి వైద్యాధికారులు లక్ష్మీకర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, తేజ, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ శివప్రసాద్ రెడ్డి, పాఠశాల హెడ్మాస్టర్ గుర్రప్ప, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శారదా భవాని, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, సీఓ ఎంవీ సుబ్బారెడ్డి, డిగ్రీ కాలేజీ విద్యార్థినులు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి


పాఠశాల విద్య ఆర్‌జేడీకి వినతిపత్రాన్ని సమర్పిస్తున్న వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఓబులపతి

కడప ఎడ్యుకేషన్ : జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయుల సమస్యలను తక్షణం పరిష్కరించాలని వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఓబులపతి, రాష్ట్ర ఉపాధ్యక్షులు చల్లా ప్రసాద్ రెడ్డిలు కోరారు. ఈ విషయమై శుక్రవారం పాఠశాల విద్య ఆర్‌జేడీ వెంకట క్రిష్ణారెడ్డిని కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఇటీవల బదిలీ అయిన, పదోన్నతి పొందిన కొందరికి జీతాలు రావడం లేదన్నారు. సంబంధిత సమస్యను పరిష్కరించాలన్నారు. అలాగే మోడల్, కేజీబీవీలలో ఉన్న ఖాళీ పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఇటీవల ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఎంఈఓ- 2 పోస్టుల ద్వారా పర్యవేక్షణ మెరుగుపడిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన విప్లవాత్మక మార్పుల వల్ల ప్రభుత్వ విద్య ఎంతో బలపడిందన్నారు. కార్యక్రమంలో వయోజన విద్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సోమశేఖర్‌రెడ్డితోపాటు పలువురు వైఎస్సార్‌టీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

మహిళలకు చేయూత


మాట్లాడుతున్న మెప్మా పీడీ సురేష్ రెడ్డి

పులివెందుల రూరల్: ప్రతి మహిళకు సున్నావడ్డీ, అమ్మొడి, జగనన్న తోడు పథకాలతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేయూతనిస్తున్నారని మెప్మా పీడీ సురేష్‌రెడ్డి అన్నారు. స్థానిక మెప్మా కార్యాలయంలో పొదుపు సంఘాల మహిళలతో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క మహిళను లక్షాధికారి చేయాలన్నదే తమ లక్ష్యమన్నారు. పులివెందులలో తొలిసారిగా జగనన్న మహిళా మార్టు ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో మెప్మా అధికారి గంగులయ్య, సీఓలు నాయుడు, నాగన్న, ఆర్పీలు, తదితరులు పాల్గొన్నారు.